# "ఆ గడియ వచ్చింది"

## యోహాను 12:20-36, 46-48,

## పరిశీలన

"నేను యింకొక్క ప్రసంగం చేయవలసి యుంటే" అనే అంశం మీద ప్రసంగించమని అనేక సార్లు నన్ను అడిగారు.[1] "ఇదే నా కడసారి ప్రసంగమని నేను ఎరిగియుంటే, ఏమి ప్రసంగిస్తాను?" అని ఒకటికంటె ఎక్కువ సార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఆ ప్రశ్నవేసికొన్న ప్రతిసారి నేను మరొక తీర్మానానికి వచ్చాను. నేను ఎదుర్కొనే శ్రోతలు, ఆ సమయంలో నా మానసిక స్థితిమీద ఏమి ప్రసంగించాలో ఆధారపడి యుంటాయి గనుక.

సిలువపై ఆయన పలికిన ఏడు మాటలు వినేవరకు, యోహాను 12లో జనులతో ఆయన బహిరంగంగా[2] పలికిన సంగతులు కడపటివైయున్నాయి. "నేను యింకా ఒక ప్రసంగం చేయవలసియుంటే" అనే అంశాన్ని ప్రభువారికి యిస్తే, యోహాను 12:20-36 ఆయన జవాబైయుండ వచ్చు.

క్రీస్తు పరిచర్యలో అది చివరి గురువారం. ఆయన దేవాలయములో బోధించుచుండగా అన్యజనులలో కొందరు ఆయనను చూడనపేక్షను కనుపరచారు,[3] కథ ఆరంభమౌతుంది, "ఆ పండుగలో ఆరాధింపవచ్చినవారిలో కొందరు గ్రీసు దేశస్థులుండిరి" (యోహాను 12:20). వారు యూదా మతంలో కలిసినవారైయుండవచ్చు లేదా "దేవునికి భయపడే" కొర్నేలీవంటివారై యుండవచ్చు[4] (అపొ. 10:1, 2): సత్య దేవునియందు విశ్వసించినవారు, యూదా మతంలో కలసిపోయే నియమావళికి వారు లోబడినవారు కాకపోవచ్చు.[5]

"వారు ... బేత్సయిదా వాడైన ఫిలిప్పునొద్దకు వచ్చి"రి (యోహాను 12:21ఎ). గ్రీకు దేశస్థులు ఫిలిప్పునొద్దకు ఎందుకు వచ్చారో మనకు తెలియదు. ఫిలిప్పుకు గ్రీకు పేరున్నందున కావచ్చు.[6] వారు కూడా బేత్సయిదా వారైయున్నందున కావచ్చు.[7] లేదా, కేవలం ప్రభువు శిష్యులలో వారు తొలిగా కలిసికొన్నది ఫిలిప్పు అయ్యున్నందున కూడా కావచ్చు.

ఏదియెలాగున్నా, "అయ్యా, మేము యేసును చూడ గోరుచున్నామని అతనితో చెప్పగా" (యోహాను 12:21బి). వారు యేసును గూర్చి ఎలా ఎరుగుదురు? ఆయన దేవాలయాన్ని శుద్ధీకరించిన సమయంలో వారు అక్కడ ఉండియుండవచ్చు. అన్యజనుల ప్రాంగణంలో ఆయన బోధించుచుండగా వారు వినియుండవచ్చు. ఏమైనా సరే, వారాయనను గూర్చి విన్నారు. ఇంకా అధికంగా ఆయనను గూర్చి తెలిసికోవాలనుకుంటున్నారు.[8] ఆది భాషలో దీని రూపాన్ని చూస్తే, "పట్టువీడక వారు" అడుగుతున్నట్టు గోచరిస్తుంది.

ఆ సందర్భంలో ఏమి చేయాలో ఫిలిప్పుకు తోచినట్టులేదు. అన్యజనుల దారిలోనికి

వెళ్లవద్దని ప్రభువు తన పంద్రెండు మంది శిష్యులకు ముందుగా ఆజ్ఞాపించి యున్నారు. “ఇశ్రాయేలులో నశించిన గొర్రెల యొద్దకే వెళ్లుడని ఆయన గతంలో వారికి ఆదేశించారు” (మత్తయి 10:5, 6). ఫిలిప్పు తన స్నేహితుని సహాయం కోరాడు:[9] “ఫిలిప్పు వచ్చి అంద్రెయతో చెప్పెను” (యోహాను 12:22ఎ). “అంద్రెయయు ఫిలిప్పును వచ్చి యేసుతో చెప్పిరి” (22బి వ.).

గ్రీకు దేశస్థుల విన్నపాన్ని ప్రభువు అంగీకరించిందీ లేనిదీ మనకు తెలియదు. యోహాను 12లోని చివరి మాటలకు యోహాను మనకు పూర్వగాధనిచ్చాడేగాని వివరాలన్నిటిని యివ్వలేదు. ఏమైనా సరే, ఆ గ్రీకు దేశస్థులు–యితర అన్యజనులందరు–మనతో సహా–ప్రభువువారి ప్రత్యుత్తరంలో ఆయన మనస్సులో ఉన్నట్టు గోచరిస్తుంది (32 వచనం చూడు).

గ్రీకు దేశస్థులు కోరినదేమో ఫిలిప్పు అంద్రెయలు ప్రభువునకు తెలిపినప్పుడు, “ఆ గడియ వచ్చియున్న”దని ఆయన బదులిచ్చారు (23 వ.). దీనితో తన చివరి బహిరంగ ప్రసంగానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు “ఆయన గడియ యింకను” రాలేదంటూ వచ్చారు (యోహాను 7:30; యోహాను 2:4; 7:6; 8:20లను చూడు); యిప్పుడైతే అది వచ్చింది (యోహాను 13:1 చూడు).

“గడియ వచ్చియున్న”దనడంలో ప్రాథమికంగా తన మరణాన్ని మనస్సులో ఉంచుకొని ఆయన పలికారు (యోహాను 12:24); అయితే ఈ లేఖన భాగము దానికి సంబంధించిన పలు ఆలోచనలను తాకుతుంది. ఈ హేతువును బట్టి, “ఆ సమయము వచ్చియున్నది” అనే అంశం పలు అంశాలను చుట్టివస్తుంది. అయినా, ప్రధాన చర్చనీయాంశం సిలువైయుంటుంది.

## సిలువకును, అప్పగింతకును గడియ (23-26 వచనాలు)

**సిలువ (23, 24 వచనాలు)**

“మనుష్యకుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చియున్నది” అంటూ ప్రభువు తన ప్రసంగాన్ని ఆరంభించారు[10] (23 వ.). “మనుష్యకుమారుడు” అంటే మెస్సీయ (దానియేలు 7:13). “క్రీస్తు మహిమ పరచబడే” “సమయం ఆసన్నమయ్యిందని” ప్రభువైన యేసు అన్నారు. ఆయన తన మరణాన్ని గూర్చి ఆలోచిస్తున్నారు (యోహాను 12:24) గాని ఆయన సమాధిని దాటి పునరుత్థానాన్ని, ఆరోహణాన్ని చూడగలుగుతున్నారు.

క్రీస్తు మాటలు జనసమూహాలను ఉత్తేజ పరచియుండవచ్చు. “మహిమ” పరచబడడమంటే, వారి ఉద్దేశంలో రాజకీయమైన మెస్సీయా రాజ్యాన్ని స్థాపించడమనే వారి మనస్సులకు తట్టుతుంది. గత కొన్ని దినాలకు ముందుగా, ఆయన పట్టణంలోనికి విజయోత్సవంతో ప్రవేశించినప్పుడే క్రీస్తు మహిమపరచబడతాడని వారు ఎదురుచూచారు, అయితే ఏదో యొక కారణాన్ని బట్టి వారు ఎదురుచూచిందానిని ఆయన నెరవేర్చలేదు. చివరిగా యిప్పుడు మహిమపరచబడడాన్ని గూర్చి ఆయన మాట్లాడుతున్నారు.

రోమీయులకు వ్యతిరేకంగా ప్రభువు దండయాత్ర చేయబోయే ఆయన కాలమాన పట్టికను గూర్చి ఊపిరిపీల్చకుండ వారు ఎదురుచూస్తూ ఉండవచ్చు. ఆలాగున ఆయన తన సింహాసనాన్ని ఏర్పరచుకొనడం వారు కోరుకుంటారు. ఎట్టకేలకు, నిత్యత్వపు బూర మోగించబడుతుంది, పరలోకపు సైన్య సమూహము క్రమంగా ముందుకు సాగిపోతుంది, విజయం దగ్గరలోనే ఉందని వారి భావన: సైనిక వ్యూహం గూర్చి మాట్లాడే దానికి బదులు, క్రీస్తు మరణించడాన్ని గూర్చి మాట్లాడ నారంభించారు. దానితో వారు ఎంతగా నిరాశచెందియుంటారో!

సాధారణమయ్యిందే, అయితే బహు శక్తివంతమైన ఉదాహరణను ప్రభువు ఉపయోగించారు: "గోధుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును; అది చచ్చినయెడల విస్తారముగా ఫలించును" (24 వ.) ఆ గింజను భద్రంగా దాచియుంచు, అది ఫలింపనేరదు, "అది ఒంటరిగానే మిగిలిపోతుంది." దానిని భూమిలో వేసి, నీరు కట్టి, అది నూరంతలుగాను, అరవదంతలుగాను, ముప్పదంతలుగాను ఫలిస్తుంది (మత్తయి 13:8). ఈ ఉదాహరణలో, యేసు తానే విత్తనమైయున్నారు. ఆయన మరణించకుంటే, ఆయన తన జీవితాన్ని కాపాడుకోగలరేగాని, యితరులను ఆయన దీవించలేరు. నూతన జీవము ఉనికిలోనికి తెచ్చే ఏకైక మార్గం ఆయన మరణించడం వలననే.

**అప్పగించుకొనుట (25, 26 వచనాలు)**

"తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును, ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవము కొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (25 వ.), అంటూ క్రీస్తు కొనసాగించారు. "ద్వేషించుట," అని ఆయన యిక్కడ ఉపయోగించిన పదానికి "తక్కువగా ప్రేమించుట"[11] అనేది అర్థం. ప్రభు చిత్తమును జరిగించుటకు ప్రేమించుట కంటే తక్కువగా మన జీవితాలను ప్రేమించాలి. ఈ ప్రసంగము పైకి విరుద్ధ భావాలుగా కన్పించేవాటితో నిండియుంది: "నీవు నీ ప్రాణాన్ని ప్రేమించితే, దానిని నీవు పోగొట్టుకొంటావు"; "నీవు నీ ప్రాణాన్ని ద్వేషించితే, నీవు దాన్ని దక్కించుకుంటావు"; "జీవించడానికి ఏకైక మార్గము చనిపోవడమే."

తొలిగా ఈ మాటలను ప్రభువు తనకే వర్తింపజేసికొన్నారు. తన ఉద్దేశాన్ని నెరవేర్చుకోవాలన్నా, దేవుని సంకల్పంలో తన స్థానాన్ని దక్కించుకోవాలనుకున్నా, ఆయన మరణించవలసియుంటుంది. ఆ మాటలు ఆయన మనకు వర్తింపజేయాలంటారు; వర్తింపజేసికోమంటారు. దేవుని దృష్టిలో మనకు విలువ కావాలంటే, మనం కూడ "చనిపోవలసిన" వారమైయున్నాం. దేవునికి నమ్మకంగా ఉండడానికి గాను అనేకమంది క్రైస్తవులు ఆదిలో చనిపోవలసి వచ్చింది (ప్రకటన 2:10). మనం ఆలాటి త్యాగానికి పిలువబడక పోయినా, "అహం" విషయంలో మనం చావవలసినవారమై యున్నాం. పౌలు యిలా రాశాడు: "నేను క్రీస్తుతోకూడా సిలువవేయబడియున్నాను, యికను జీవించువాడను నేను కాదు, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" (గలతీ. 2:20ఎ).

ప్రభువు కొనసాగించుతూ, తన భావాన్ని విస్తరింపజేసి, ఆయనను సేవించడంలో మరణించడానికి యిష్టపడేలా ఉద్దేశాన్ని కలిగించ ప్రయత్నించారు. "ఒకడు నన్ను సేవించిన యెడల ..." అంటూ ఆయన ఆరంభించారు (యోహాను 12:26ఎ). ప్రభువును సేవించడంలో మనం మన జీవిత విధానాలను స్వార్థరహితమైన త్యాగానికి అప్పగించు కొంటాం. ఆలాటి సమర్పణ చేసికొనేవాడు, "నన్ను వెంబడించాలని" ఆయన తెలిపారు (26బి వ.). "నేను ఎక్కడ ఉందునో,[12] అక్కడ నా సేవకుడును ఉండును" అనడంలో ఆలాటి త్యాగం చేయదగినదేయని ఆయన సూచించారు (26సి వ.). (ఈ ఆలోచనను క్రీస్తు యోహాను 14:1-3లో వివరించారు). "ఒకడు నన్ను సేవించినయెడల నా తండ్రి అతని ఘనపరచును" అని కూడా ఆయన అన్నారు (యోహాను 12:26డి). స్వయంగా దేవునిచే ఘనపరచబడడం అనేదాన్ని ఊహించు! పౌలు యిలా అన్నాడు "క్షణమాత్రముందు మా చులకనైన శ్రమ మాకొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది" (2 కొరింథీ. 4:17)!

## సంఘర్షణకు, ఖాయపరచుటకు వచ్చిన గడియ (27-30 వచనాలు)

**సంఘర్షణ (27 వ.)**

చనిపోవుటను గూర్చి మాట్లాడుటకు క్రీస్తు వెనుకాడలేదు. అయితే ఆ అంశం ఆయనకు యింపుగా ఉందని దాని అర్థంకాదు. మరణాన్ని ఎదుర్కొనడం మనకు అంత సులభమైన సంగతి కాదు, అది ప్రభువు వారికి కూడా అంత తేలికగా ఏమిలేదు. ఆయన సొంత యిష్టంలేని కీలుబొమ్మకారు. ఆయన రక్తమాంసాలతో ఉన్నారు. మనం గాయపరచబడినట్టే ఆయన గాయపరచబడతారు.

క్రీస్తువారు ప్రార్థించిన గెత్సేమనే దృశ్యాన్ని యోహాను చిత్రించలేదు. అక్కడ "... నీ చిత్తమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలిగించుము ..." అంటూ ఆయన ప్రార్థించారు (మత్తయి 26:39).[13] గెత్సేమనేకు ముందు ప్రభువు తన ప్రాణాన్ని గూర్చిన క్షణిక దర్శనాన్ని యిచ్చారు: "ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది" అని ఆయన తెలియజేశారు (యోహాను 12:27ఎ). "నా ప్రాణము కలతచెందుచున్న"దని New English Bibleల్లో ఉంది. భయానకమైన సంగతులు ఎదురుచూస్తున్నాయి. భౌతిక మరణవేదనకు తోడు [తనపైనున్న మానవ పాపమును బట్టి] దేవునికి ఎడమయ్యే స్థితి మరి భరించరానిదై యుండబోతుంది. సిలువపై అవమానానికి తోడు, అపవాదితో పోరు (12:31), పదిహేను వందల సంవత్సరాలు వారిని పెంచిన తరువాత దేవుని ప్రజలనబడేవారిచే నిరాకరింపబడడమనే హృదయవేదన ఆయనను చుట్టుకొననుంది.

దీనంతటి వెలుగులో, "నేనేమందును?" (27బి వ.) అంటే, "నేను దేనికొరకు వేడుకొందును?" అని ఆయన తనకు తానే అనుకొన్నట్టున్నారు. "-తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము" అని ఆయన ప్రార్థించవలెనా? (27సి వ.). లేదు.[14]

"అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని" అని ఆయన అన్నారు (27డి వ.). "నశించినదానిని వెదకి రక్షించడానికి ఆయన వచ్చారు" (లూకా 19:10). మరణించడానికి ఆయన ఈ లోకానికి అవతరించారు (ఫిలిప్పీ. 2:7, 8).

**ఖాయపరచుట (28-30 వచనాలు)**

తండ్రి చిత్తానికి తన్ను లోబరచుకునే మాటలను ఆయన యిలా పలికారు: "తండ్రీ, నీ నామము మహిమపరచుమని చెప్పెను" (28ఎ వ.). తన జీవితకాలమంతయు లోబడియుండుటచే ప్రభువు దేవుని నామాన్ని మహిమపరచారు (యోహాను 17:4 చూడు); తన మరణం ద్వారా కూడ యింకను ఆ నామాన్ని ఆయన మహిమపరచబోతున్నారు.

ఆ సమయంలో, ఎదురుచూడని ఒక సంభవం జరిగింది: "ఒక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (యోహాను 12:28బి). ప్రభువైన యేసు పరిచర్య కాలంలో ముమ్మారు దేవుడు పలికారు: ఆయన బాప్తిస్మ సమయంలో (మత్తయి 3:17), ఆయన రూపాంతర సమయంలో (మత్తయి 17:5), మరియు ఈ సందర్భంలో ఆ స్వరం యిలా అంది: "నేను దానిని మహిమపరచితిని, మరల మహిమ పరతునని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (యోహాను 12:28సి). తన బ్రదుకు ద్వారా క్రీస్తు దేవుని నామాన్ని మహిమపరచారు, ఆయన మరణం ద్వారా కూడా మహిమపరచాలని ఆయన కోరుతున్నారు.

ఆకాశం నుండి కలిగిన ఆ శబ్దం జనులను ఎంతగా దిగ్భ్రమపరచిందంటే, ఆ జరిగిన సంఘటన విషయంలో ప్రజలు భేదాభిప్రాయాలను వ్యక్తపరచారు: "కాబట్టి అక్కడ నిలుచుండి వినిన జనసమూహము-ఉరిమెను అనిరి. మరికొందరు-దేవదూత ఒకడు ఆయనతో మాటలాడెననిరి" (29 వ.). దేన్ని వినడానికి మనం సిద్ధపడతామో అదే మనకు వినిపిస్తుంది. ఉదాహరణకు, మన చెవులు వినలేనంత శబ్దాలతో గాలి నింపబడియుంది. అయినా, మనం రేడియోను ట్యూన్ చేసి, ఆ స్టేషన్ నుండి మనం సంగీతమే వినవచ్చు. దేవుని శబ్దం వినడానికి అక్కడ క్రీస్తుతో నిలిచియుండినవారు సిద్ధపడియుండలేదు. గనుక వారికి అది "ఉరుములా" అనిపించింది - ఓ పెద్ద "శబ్దం." ఆలాగే నేడు అనేకులు సృష్టిలో దేవుని స్వరం వినలేకయున్నారు (రోమా 1:20) మరియు బైబిల్లో కూడా వినలేకయున్నారు (హెబ్రీ. 1:1, 2).

యోహానులా కొందరు దాన్ని అర్థంచేసికొన్నారనుకో సమీపాన ఉన్నవారివైపు (ప్రత్యేకంగా అపొస్తలులవైపు) తిరిగి - "ఈ శబ్దము నాకొరకు రాలేదు, మీ కొరకే వచ్చెను" (యోహాను 12:30) అని ప్రభువన్నారు. "నా కొరకు మాత్రమే కాదు, కాని మీ కొరకు కూడ" అనే భావం కావచ్చు.[15] తండ్రిచే అది ఖాయం చేయబడడంవలన, ఎదుర్కోబోయే శోధనలకు కుమారుడు బలపరచబడ్డారు, కాని ప్రభువైన యేసు ఎదుర్కోబోయేవి దేవుని చిత్తప్రకారమే జరుగుతుందని ప్రత్యేకంగా తన శిష్యులను ఒప్పించడానికి సంకల్పించబడింది.

## గెలుపుకు, మార్పుకు వచ్చిన గడియ (31-33 వచనాలు)

**గెలుపు (31 వ.)**

క్రీస్తు సిలువపై మరణించినప్పుడు అనేకమైన ప్రధాన కార్యాలు జరుగుతాయి. ఉదాహరణకు, అది గెలుపొందే సమయం, దుష్టశక్తుల మీద విజయం. అది ఓటమి సమయంలా కన్పిస్తుందే గాని, నిజానికి అది గెలుపొందే సమయమే.

"ఇప్పుడు ఈ లోకమునకు తీర్పు జరుగుచున్నది; ఇప్పుడు ఈ లోకాధికారి[16] బయటకు త్రోసివేయబడును" అని ప్రభువన్నారు (31 వ.). "ఈ లోకాధికారి" అనేది అపవాదిని సూచిస్తుంది (యోహాను 14:30; 16:11).[17] సాతానుతో అత్యున్నతమైన పోరు సిలువలో జరిగేదే. నీతి, దుర్నీతి శక్తుల మధ్య ఒక వింతైన, పౌరాణిక యుద్ధమేదో జరుగుతుందని, ("అది హెర్మోగిద్దోను యుద్ధమని"[18]) నేడు కొందరు ఊహలు ఊహించుతున్నారు. అయితే తేల్చివేయబడిన-యుద్ధం సిలువలోనే జరిగిపోయినట్టు బైబిలు బోధిస్తుంది. "... మరణముయొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడ రక్త మాంసములలో పాలివాడాయెను" అని హెబ్రీ గ్రంథ రచయిత అన్నాడు (హెబ్రీ. 2:14, 15). సాతాను నేడు యింకను చురుకుగా పని చేస్తున్నాడు (1 పేతురు 5:8), కాని మనపై వానికున్న పట్టు వదిలించబడింది. వాడు కేవలం జయింపబడిన శత్రువే (యాకోబు 4:17).[19]

**మార్పు (32, 33 వచనాలు)**

సిలువపై లభించిన అతి ముఖ్యమైన విజయం పాపముపై విజయమే ( 2 కొరింథీ. 5:21 ఎఫెసీ. 1:7). తన్ను చూడ వచ్చిన గ్రీకు దేశస్థులను ప్రభువు తన ప్రసంగంలో ఎన్నడూ మరచిపోలేదు. ఆయన మరణం కేవలం యూదులకొరకు మాత్రమేనా? కాదు; అది సర్వమానవాళి కొరకు: "నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని చెప్పెను" (యోహాను 12:32).

క్రొత్త నిబంధనలో తక్కిన స్థలాల్లో, "పైకెత్తబడుట" అంటే హెచ్చింపబడుట అనే అర్థం చెప్పబడింది (1 తిమోతి 3:6; యాకోబు 4:10 చూడు). అయితే యోహానులో యిది ఎల్లప్పుడు ప్రభువు మరణాన్ని సూచిస్తుంది (యోహాను 3:14; 8:28). "తాను ఏ విధముగా మరణము పొందవలసియుండెనో సూచించుచు ఆయన ఈ మాట చెప్పెను" (యోహాను 12:33).[20] రాళ్లు రువ్వడం వలనగాని, యూదులు మరణదండన విధించు మరి ఏ రూపంలోగాని ఆయన చనిపోడు; గాని, రోమా సిలువ మీదనే ఆయన "ఎత్తబడతా"రు.

అది జరిగినప్పుడు, "అందరిని" ఆయన తన యొద్దకు ఆకర్షించుకుంటారు: యూదులను, అన్యజనులను కూడా; ఆ యిద్దరిని ఒక్క శరీరంగా ఏకం చేస్తారు. పౌలు యీ విధంగా రాశాడు,

> ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి, మన ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి, తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దానిద్వారా వీరిద్దరిని ఏకముగాచేసి, దేవునితో సమాధానపరచవలెనని యీలాగు చేసెను గనుక ఆయనయే మన సమాధాన కారకుడైయున్నాడు (ఎఫెసీ. 2:14-16).

ఆ ఒక్క "శరీరము" ఆయన సంఘము (ఎఫెసీ. 1:22, 23; కొలస్సీ. 1:18; 1 కొరింథీ. 12:13).

ప్రభువైన యేసు ప్రజలను తోలుకొనిపోరు, నెట్టరు, బలవంతంచేయరు; కాని ఆయన వారిని ఆకర్షిస్తారు. ఆకర్షించే దైవికమైన శక్తి సిలువయందును, అది ప్రతిఫలింపజేయు ప్రేమయందు ఉంది (యోహాను 3:16; రోమా. 5:8). నూతనమైన మొలకలను సూర్యరశ్మి భూమిలోనుండి ఎలా మెల్లగా పైకి ఎదుగజేస్తాయో, ఆలాగే క్రీస్తు ప్రేమ సున్నితంగా మనుష్యులను తన వైపుకు ఆకర్షిస్తుంది.[21]

## తారుమారు మరియు సవాలు గడియ (34-36, 46-48 వచనాలు)

### తారుమారు

ప్రభువైన యేసు మాటలు గ్రహించడానికి జనులకు కష్టం కలిగింది. వారు గ్రహించలేక పోవడంలో ఆశ్చర్యములేదు. ఇంతకు సమస్య ఏమంటే, వారు గ్రహించడానికి ప్రయత్నించలేదు; "క్రీస్తు ఎల్లప్పుడు ఉండునని ధర్మశాస్త్రము[22] చెప్పుట వింటిమి" అని వారన్నారు (34ఎ వ.). పాత నిబంధనలో ఏ భాగంలోను యిది చెప్పబడలేదు. కాని నిత్య రాజ్యముపై మెస్సీయ నిరంతరము రాజైయుంటాడని పాత నిబంధన తెలిపింది (యెషయా 9:7; యెహెజ్కేలు 37:25; దానియేలు 7:14). ఇది మెస్సీయ/క్రీస్తు చేయగల ఒకే విధానం "నిరంతరం" ఆయన యిక్కడే ఉండవలసియుంటుంది.

"మనుష్యకుమారుడు పైకెత్తబడవలెనని నీవు చెప్పుచున్న సంగతి ఏమిటి?" అని వారాయన నడిగారు (యోహాను 12:34బి). "పైకెత్తబడడం" అంటే సిలువవేయబడడమని వారు గ్రహించినట్టున్నారు. అయితే మెస్సీయాను గూర్చిన వారి భావనతో యిది ఏకీభవించలేదు. ఆయన మృతి బొందియు ఎలా పాలించగలడు? తమకు తెలియని మరో భావంతో "మనుష్య కుమారుడని" ఆయన ఉపయోగించి యుండవచ్చునని వారు తీర్మానించుకున్నారు. అందువలన "మనుష్య కుమారుడగు ఈయన ఎవరని ఆయన నడిగిరి" (34సి వ.). "నీవు మెస్సీయను గూర్చి మాట్లాడుతున్నావా లేక వేరొకని గూర్చి మాట్లాడుచున్నావా?" అని వారాయననడిగారు.

### సవాలు (35, 36, 46-48 వచనాలు)

ప్రత్యక్షంగా గాక పరోక్షంగా ప్రభువు వారికి బదులిచ్చారు: "మనుష్య కుమారుడని"

తాను చెప్పుచున్న వ్యక్తి "లోకమునకు వెలుగై" యున్నవాడని ఆయన వారికి తెలిపారు (35; 8:12; 9:5లను చూడు). ఏదియోలాగున్నా, మెస్సీయాకు సంబంధించిన బిరుదుల వర్ణనద్వారా తన శ్రోతలు తన్ను తెలిసికోవాలని కాదు, వారు ఉన్నపాటునే ఆయనను మెస్సీయాగా అంగీకరించాలని క్రీస్తు కోరుకున్నారు.

తనయందు విశ్వాసముంచవలెనని ప్రజలను కోరడానికి యిదే ఆయన చివరి అవకాశమై యుండవచ్చు. వారికి తిరిగి ప్రసంగించే అవకాశముండదని ఎరిగి కొందరు శ్రోతలకు నేను ప్రసంగించిన అనేక సందర్భాలు ఏర్పడ్డాయి. బాధ్యత ఎంతో ఎక్కువైయుంటుంది. నేను ఏమి చెప్పగలను? నేను ఏమి చెప్పాలి?

ఆ గడియ యొక్క అవసరతనుబట్టి క్రీస్తు విన్నపం యిలా నొక్కి చెప్పింది: "ఇంక కొంత కాలము వెలుగు మీ మధ్య ఉండును" అని ఆయన అన్నారు (12:35ఎ). "నేను లోకమునకు వెలుగు"నని గతంలో ఆయన తన్ను సూచించుకున్నారు (9:5). తన మరణానికి ముందు ఆ జనుల మధ్య ఆయన కొన్ని రోజులు మాత్రమే ఉండబోతారు. గనుక కలిగిన అవకాశాన్ని సద్వినియోగం చేసికోవాలని ఆయన వారిని కోరారు: "చీకటి మిమ్మును కమ్ముకొనకుండునట్లు మీకు వెలుగు ఉండగానే నడువుడి; చీకటిలో నడుచువాడు తాను ఎక్కడికి పోవుచున్నాడో ఎరుగడు" (12:35బి). తన్ను క్రీస్తుగా అంగీకరించుడని ఆయన వారిని బ్రతిమాలారు: "మీకు వెలుగుండగానే వెలుగునందు విశ్వాసముంచుడని వారితో చెప్పెను" (36ఎ వ.). వారాయనయందు విశ్వాసముంచి ఉండినట్టయితే, వారు "వెలుగు కుమారులైయుండేవారే" (36బి వ.). ఆయన వెలుగు ప్రతిబింబములుగా వారు మారిపోయారు.

వారాయనను అంగీకరించకపోతే ఏమౌతుంది? వెలుగును నిరాకరించడంలో ఉన్న విపత్తు ఎలాటిదై యుంటుందో ఈ అధ్యాయపు భాగంలో మనం చుస్తాం. అక్కడ ప్రభువు యిలా అన్నారు:

> నాయందు విశ్వాసముంచు ప్రతివాడును చీకటిలో నిలిచియుండకుండునట్లు నేను ఈ లోకమునకు వెలుగుగా వచ్చియున్నాను. ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండినయెడల నేనతనికి తీర్పుతీర్చను; నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని లోకమును రక్షించుటకే వచ్చితిని. నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును (46-48 వచనాలు).[23]

ఈ ప్రసంగ వివరాన్ని యోహాను ముగించుతూ యిలా సూచించాడు: "యేసు ఆ మాటలు చెప్పి వెళ్లి వారికి కనబడకుండ దాగియుండెను" (36సి వ.). క్రీస్తు జీవితపు సంక్షేప వర్ణన సరియైనదైతే, ఆయన తన శిష్యులతోకూడ ఒలీవకొండ చరియకు "వెళ్లిపోయెను" (మత్తయి 24:1, 3). ఏదియెలాగున్నా, "ఎక్కడికి?" అనేది ప్రాముఖ్యం కాదు. ఏది ప్రాముఖ్యమయిందంటే, ఆయన అక్కడనుండి వెళ్లి వారికి కనబడకుండ "దాగి" యుండెను అనేదే. వారి అవకాశపు దినం గతించిపోయింది.

## ముగింపు

ప్రభువువారి "కడపటి ప్రసంగానికి" ప్రజలనుండి ఏలాటి స్పందన లభించింది? యూదులలో అలుముకొన్న అవిశ్వాస ఛాయలను యోహాను (12:37-50) చివరి భాగము నొక్కిచెప్పింది.[24] లోబడుడని నేను అర్థించినప్పుడు ప్రజలు నిరాకరించితే ఎలాగుంటుందో నాకు తెలుసు; తన శ్రోతలలో స్పందన లేకపోవడం ప్రభువు హృదయాన్ని పగుల గొట్టియుంటుంది.

ఇప్పుడు, ఎలాగైనా, వ్యక్తిగతమైన వర్తింపు చేసికోవలసియుంటుంది.[25] ప్రభువైన క్రీస్తును మనం అభినందిస్తున్నామా? సిలువను మనం అభినందిస్తున్నామా? సిలువ ఎంత మూల్యం కోరిందో నీవు గ్రహించావా? (27 వ.). "ఆ గడియయొక్క అవసరతను" మనం గ్రహించియున్నామా? లోబడు గడియ నీకు వచ్చియుంది. నీవు ప్రభువు వద్దకు రావలసిన అవసరముంటే యిప్పుడు నేను నిన్ను వేడుకొంటున్నా.

## నోట్సు

"యేసు ఒకే ప్రసంగం చేయవలసినప్పుడు" అనే పేరు ఈ ప్రసంగానికి పెట్టవచ్చు ... ఆకర్షించు సిలువ శక్తిని గూర్చి నీవు చర్చించునప్పుడు, Magnet ఉపయోగించవచ్చు. లోకము ఆకర్షితమైయుండాలనే విషయాన్ని నీవు నొక్కి చెప్పవచ్చు. అల్యూమినియంను మేగ్నెట్ ఆకర్షించలేదు. ఇనుప వస్తువులను మేగ్నెట్ ఆకర్షించగలదు, ఆలాగే నేడు ప్రజలలో కొందరు ఆకర్షింపబడనొల్లరు (ఆనాటి ప్రభువువారి శ్రోతలవలెనే).

---

సూచనలు

[1]స్థానిక సంఘాలలో మాట్లాడుటకు పిలిచినప్పుడు అంశాలను నాకు ముందుగా తెలుపుతారు. [2]గ్రీకు దేశస్థులకు సంబంధించిన సంఘటన ఎక్కడ జరిగిందో నిశ్చయముగా చెప్పలేం. [3]ఈ సందర్భంలో ప్రభువు స్త్రీల ప్రాంగణంలో ఉండియుండవచ్చు. అన్యజనులు స్త్రీల ప్రాంగణంలోనికి వచ్చే అవకాశం లేదు. [4]"దేవునికి భయపడువారు" గా క్రొత్త నిబంధనలో అనేకులు చెప్పబడ్డారు. అయితే యూదులుగా మారకుండ ఉండిన అన్యజనులను ఈ ప్రత్యేక సందర్భం సూచిస్తుంది. [5]యూదా మతాన్ని అవలంభించిన అన్యులు–:(1) (పురుషుడైతే) సున్నతి (2) స్వయంగా నీటమునగడం (సాక్షుల యెదుట) (3) బలియర్పించడం.– సున్నతి అవసరమైనందున పురుషులకంటె స్త్రీలే ఎక్కువగా యూదామతాన్ని అవలంభించారు. [6]"Philip" (ఫిలిప్పు) "గుర్రమును ప్రేమించువాడు" అని అర్థం. [7]రెండు బేత్సయిదాలున్నాయి. ఒకటి కపెర్నహూమునకు సమీపంలో (మార్కు 6:45). రెండవది బేత్సయిదా జూలియస్ అని పిలువబడేది. సముద్రపు ఈశాన్యాదిశగా ఉంటుంది. ఫిలిప్పు కపెర్నహూము దగ్గరనున్న బేత్సయిదాలో నివసించియుండవచ్చు. [8]గ్రీకులను సిరియా రాజులు పంపినట్టు చరిత్రకారుడైన ఇసుబియస్ దైవ ప్రేరేపితము కాని పారంపర్యాన్ని తెలిపారు. [9]ఫిలిప్పు అంద్రెయలు ఒకే పట్టణస్థులు (యోహాను 1:44). [10]క్రీస్తు జీవితంలోని చివరి భాగపు వర్ణనలో "మహిమ" అనేది యోహాను ప్రధాన చర్చనీయాంశంలా ఉంటుంది – నీవు చదివేటప్పుడు దీన్ని గమనించు.

[11]"క్రీస్తు జీవితం, 2" ను చూడు. [12]ప్రభువైన యేసు పరమందున్నారు (2 కొరింథీ. 5:8; ఫిలిప్పీ. 1:23; ప్రకటన 21:3లను చూడు). [13]ఈ దృశ్యం సినాప్టిక్ సువార్త రచయితల ద్వారా దాఖలు చేయబడింది. [14]alla అనే గ్రీకు పదం నుండి యోహాను 12:27లోని "అయినను" అనేది వచ్చింది. [15]దీనిని అలంకార భాషలో "ఎల్పిస్స్" అంటారు. [16]Kosmos అనే గ్రీకు పదం నుండి world అనే తర్జుమా వచ్చింది. ఈ వచనంలో విశ్వాన్ని యిది సూచించదు. ఈ లోక నటనకు తీర్పు. చెట్లు చేమలు, రాళ్లు రప్పలకు కాదు. [17]"ఈ లోకాధికారిగా" అపవాదిని గూర్చిన చర్చను "క్రీస్తు జీవితం, 1లో" చూడు. [18]ఈ చర్చను గూర్చి "The Battle That Never Was and Never Will Be" in "Revelation, 8,"

*Truth for Today* (September 1999): 26-32లో చూడు. [19]సిలువ ద్వార సాతానుని ఓడించుటను గూర్చి "Slain Any Dragons Lately?" in "Revelation, 6," *Truth for Today* (July 1999): 36-43. [20]"యెడల" అని యోహాను 12:32లోనిది "ఎప్పుడు" అనే భావంతో ఉపయోగించబడింది.

[21]ప్రసంగపు ముగింపులోని సూచనను చూడు. [22]"ధర్మశ్శాస్త్రము" అనే ప్రయోగం యిక్కడ కేవలం తొలి అయిదు పుస్తకాలకే పరిమితి చేయకుండ పాతనిబంధన అంతటిని సూచిస్తున్నట్టుంది. [23]యోహాను 12:46–48 గూర్చి సంక్షిప్త వ్యాఖ్యానమును "క్రీస్తు జీవితం, 5ను" చూడు. [24]యోహాను 12:37–50 గూర్చి సంక్షిప్త వ్యాఖ్యానమును "క్రీస్తు జీవితం, 5ను" చూడు. [25]నీ శ్రోతలకు సంబంధించిన దానిని వివరించు 25, 26 వచనాల్లో యివ్వబడిన సవాలు దగ్గరికి వెళ్లవలసి వచ్చును: "మనము మరణించడానికి సిద్ధంగా ఉన్నామా లేదా అని తీర్మానించాలి. ప్రభువునకు మన జీవితాలను సమర్పించ తీర్మానించాలి. ఆయన సవాలుతో ఆయన షరత్తుల యొద్దకు రావలెను!" యేసుకు విధేయత చూపించు వరకు వారికను "యేసుని వెంబడించుటకు" యింకా సిద్ధంగా లేరని శ్రోతలకు చెప్పు. ఇది క్రైస్తవులకు, క్రైస్తవులు కానివారికి అన్వయిస్తుంది (మార్కు 16:15, 16; అపొ. 2:38; 8:22, 23; యాకోబు 5:16).

యెరూషలేము పట్టణము దాని చుట్టు ప్రదేశం

